
ఈ వారం తెలుగు పుస్తకం

# శ్రీపాద అనుభవ మంటపం

## "అనుభవాలూ -జ్ఞాపకాలూను"

వల్లంపాటి వెంకటసుబ్బయ్య




Title: Anubhavaalu-Gnaapakaaloonu
Author: Sreepaada Subrahmanya Sastry
Year of Publication: 1999
Pages: 570 : Paper Back
Price: US$ 4.16

తెలుగు కథా సాహిత్య చరిత్రలో శాశ్వతస్థానం ఉన్న మహారచయిత శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి. వారు తెలుగు కథా సాహిత్యంలోకి తీసుకు వచ్చిన కథా వస్తువులకూ, కథన పద్ధతులకూ ఏనాటికీ విలువ తగ్గదు. "ఇలాంటి తవ్వాయి వస్తే", "బ్రాహ్మణాగ్రహారం" లాంటి కథల్లోని వస్తువులూ, "కలుపు మొక్కలు", "అరికాళ్ళకింద మంటలు" లాంటి కథల్లోని కథన పద్ధతులూ, "వడ్లగింజలు", "గులాబీ అత్తరు" లాంటి కథల్లోని నేపథ్య చిత్రణలూ దయాదాక్షిణ్యాలులేని కాలపు ప్రవాహానికి ఎదురీది నిలబడగలవు. అంతే కాదు, కాలం ముందుకు సాగినకొద్దీ శ్రీపాద కొత్త చూపుకు విలువ పెరుగుతుంది.

శ్రీపాద ప్రతిభ కథకు మాత్రమే పరిమితం కాదు. "రాజ రాజు", "సాహసిక రాజ పుత్రము" వంటి నాటకాలు రాశారు. "మిథునానురాగము", "శ్మశాన వాటిక" వంటి నవలలు రాశారు. "పాణిగృహీత, శ్రవణానంద శృంఖల" వంటి విమర్శ గ్రంథాలు రాశారు. ఆయుర్వేదాన్ని గురించి రాయటంతో ఆగకుండా "గంధర్వ ఫార్మసీ" ని స్థాపించి మందుల్ని తయారు చేసి, వ్యాపారంలో చేయి కాల్చుకున్నారు. "రెడ్డి రాణి" లాంటి పత్రికలకు వెన్ను దన్నుగా ఉండి సాయం చేశారు. ఎంతో వ్యయప్రయాసలకు ఓర్చి "ప్రబుద్ధాంధ్ర" పత్రికను నిర్వహించారు. వాల్మీకి రామాయణాన్ని వ్యావహారిక వచనంలోకి అత్యంత మధురంగా అనువాదం చేశారు. వారు దక్షత కలిగిన సాంస్కృతిక కార్యకర్త కూడా. అన్నిటికీ మించి స్వతంత్రంగా, ఆత్మగౌరవంతో జీవించారు. 1891లో పుట్టిన శాస్త్రిగారు 1961లో చనిపోయారు.

శ్రీపాద తెలుగు రచయిత కావటం వెనక తీవ్రమైన, సుదీర్ఘమైన పోరాటం ఉంది. తన ఆలోచనలను, తన మాతృభాషలో చెప్పుకోవటంకోసం వారు సంప్రదాయంతోనూ, కుటుంబంతోనూ, చివరకు అంతరంగంతోనూ పోరాటం చేయవలసి వచ్చింది. నాకు తెలిసి ప్రపంచ సాహిత్యంలోని కథా రచయితల్లో ఇలాంటి సంఘర్షణను ఇంతకాలం భరించిన వారూ, కొనసాగించిన వారూ మరొకరు లేరు. ఈ సంఘర్షణ వాక్ చిత్రమే "అనుభవాలూ-జ్ఞాపకాలూను". ఇది కేవలం శ్రీపాద జీవిత చరిత్ర కాదు. అనుభవాల కథనమూ కాదు. జ్ఞాపకాల నెమరువేతా కాదు. కానీ అన్నీ కలిసిన అనుభూతి మంటపం.

శ్రీపాద వారి కుటుంబం పశ్చిమ గోదావరి జిల్లాలోని వెలనాటి బ్రాహ్మణాగ్రహారమైన గుమ్మలూరు వదిలిపెట్టి రాజమండ్రి సమీపంలోని మునికొడవలి అన్న గ్రామానికి వచ్చి స్థిరపడ్డారు. ఏటా గోదావరి వరదల తాకిడికి తట్టుకోలేక మరి

కొంతకాలానికి వారు పొలమూరు చేరుకున్నారు. శ్రీవిద్యోపాసకుల బిరుదనామమే శ్రీపాద వారి ఇంటిపేరు. వీరి పితృపితా మహక్రమంలో శ్రీపాద పితామహులు తప్ప అందరూ యజ్ఞాలు చేసిన వారే. వారు కూడా భార్య చనిపోవటం చేత మాత్రమే యజ్ఞం చేయలేకపోయారట. శ్రీపాద పొలమూరులో 1891 పుట్టారు. తమ కుల విద్యలూ, కుటుంబ విద్యలూ అయిన వేదమూ, శ్రౌతమూ, స్మార్తమూ, జ్యోతిశ్శాస్త్రము, మంత్ర శాస్త్రము ఇతి శ్రీగా తండ్రి వద్ద నేర్చుకున్నారు. పంచాంగాలు గుణించటమూ, ప్రశ్న చెప్పటమూ క్షుణ్ణంగా బోధపరుచున్నారు. శ్రీపాద పాఠశాలకు వెళ్ళారు కానీ ఆ "ఇంగ్లీషు చదువు" కొనసాగలేదు. ఇంగ్లీషు బడులకు పంపితే కుల విద్యల పట్ల తిరస్కార భావం కలుగుతుందన్న భయంతో వారి తండ్రి శ్రీపాదను ఆ పాఠశాల చదువు మాన్పించేశాడు. స్వధర్మభ్రంశం కలగటానికి వారి దృష్టిలో ఇంగ్లీషు చదువే ప్రధానం కారణం. సంస్కృతంలో వేద, శాస్త్రాలూ, సాహిత్యమూ తప్ప తెలుగు సాహిత్యం చదువుకోవటం, తెలుగులో పద్యం రాయటం కూడా వారి దృష్టిలో స్వధర్మభ్రంశమే.

ఇలాంటి కుటుంబంలో పుట్టి పెరిగిన శ్రీపాద "నిరసన భావంతో" తాను చదువుకున్న చదువునూ, అది ప్రాతినిథ్యం వహిస్తున్న జీవిత విధానాన్నీ తిరస్కరించారు. శ్రీపాద తిరుగుబాటు స్వభావాన్నీ, అందులోని తీవ్రతనూ ఈనాడు అర్థం చేసుకోవటం సులభం కాదు. దాన్ని ఊహించటం కంటే దాన్ని గురించి వారి మాటల్నే వినటం మంచిది.

"అదొక పేద్ద గాథ

కేవలం గాథ మాత్రమే కాదు, సంకుల సమరం

సంకుల సమరమున్నూ కాదు, కల్లోలం

సహజంగా నా భావ యంత్రం ఎంత దృఢమైందైనా, అది ఎన్ని మాట్లాగి పోయిందో, ఎన్ని మాట్లు తిరుగుబాటు చేసిందో, ఎన్ని మరమ్మత్తులకు పాల్పడిందో, ఎన్ని కొత్త భాగాలు చేర్చి పునర్నిర్మాణం చేయబడిందో, తత్ఫలితంగా ఎలాంటి వడి దుడుకుల్లో కూడా ఎలా నిలదొక్కుకోగలిగిందో -

అదొక భయంకర విప్లవం

అచ్చంగా ప్రళయమున్నూ

కాగా- నా "అనుభవాలూ-జ్ఞాపకాలూను" రాయటం అంటే ఆ గొడవ అంతా విడమర్చి చెప్పటం అన్నమాట-"

శ్రీపాద "అనుభవాలూ-జ్ఞాపకాలూను" చదివి, అతని తిరుగుబాటులోని అనివార్యతనూ, ఆంతర్యాన్నీ అర్థం చేసుకోవటం తెలుగు నాట ఉన్న రచయితల, ఆలోచనా పరుల కర్తవ్యం. వారు అలా చేయలేకపోతే వారి జీవితావగాహనలో ఒక పెద్ద లోపం అలాగే నిలిచిపోతుంది.

శ్రీపాద పుట్టి, పెరిగి, ఆలోచనా పరుడుగా, రచయితగా ఎదిగి, తన సొంత దారిని నిర్ణయించుకున్న కాలం భారత దేశ చరిత్రలో- మరీ ముఖ్యంగా ఆంధ్రదేశ చరిత్రలో- ఒక సంధియుగం. శ్రీపాద మాటల్లోనే చెప్పాలంటే "ఒక యుగం గడిచి మరొక యుగం మొదలౌతున్న దినాలివి". దేశమంతా సంస్కరణోద్యమాలూ ఛాందస సంప్రదాయవిలువలను నిలదీసి ప్రశ్నస్తున్నాయి. బ్రిటీష్ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ఆధునిక విద్య సంప్రదాయ విద్యలను నిశ్శబ్దంగా తోసి రాజనటం ప్రారంభించింది. విజ్ఞానం యొక్క విస్తృతిని గురించీ, దాని ఉపయోగాన్ని గురించీ ఆలోచనాపరులు కొత్తగా ఆలోచించటం ప్రారంభించారు. అంతకు పూర్వం తర్కమో, వ్యాకరణమో, శ్రౌతమో, స్మార్తమో నేర్చుకోవటమే సర్వ విజ్ఞానమన్న భ్రమలో ఉండిన వీరు వాటిని దాటి వెళ్ళవలసిన అవసరాన్ని గుర్తించారు. సైన్సులూ, సామాజిక శాస్త్రాలు, పాశ్చాత్య భాషా సాహిత్యాలూ మన సామాజిక దృక్పథాన్ని తీవ్రంగా ప్రభావితం చేయటం ప్రారంభించాయి. సంప్రదాయ పండితులకు అంతకు పూర్వం ఉండిన వార్షికాలూ బాగా తగ్గిపోయాయి. పండిత సంచారాలకూ, వాటి ద్వారా లభించే సంభావనలకూ కాలం చెల్లిపోవటం ప్రారంభించింది. మలితరం యువకులు దాన్ని అవమానకరమైన భిక్షాటనగా-

కనీసం అంతరాంతరాల్లో - భావించటం ప్రారంభించారు. ఇరవయ్యవ శతాబ్దానికి ఇటు అటుగా వచ్చిన ఈ పరిణామాలను శ్రీపాద ఈ గ్రంథంలో కళ్ళకు కట్టినట్టుగా అభివర్ణించారు. పందొమ్మిదవ శతాబ్దం ఉత్తరార్థాన్ని అర్థం చేసుకోకుండా భారతీయ సమాజాన్ని గురించి కానీ, సంస్కృతి గురించి కానీ అర్థం చేసుకోవటం సాధ్యంకాదు. ఇరవయ్యవ శతాబ్దంలో వచ్చిన అన్ని మార్పులకూ మూలాలు పందొమ్మదవ శతాబ్దం ఉత్తరార్థంలోనే ఉన్నాయి. ఆ కాలాన్ని అర్థం చేసుకోవటానికి తెలుగులో ఉన్న చాలా కొద్ది గ్రంథాలలో ఒకటి "అనుభవాలూ - జ్ఞాపకాలూను".

శ్రీపాద బాల్య, యవ్వన కాలాలలో రెండు రకాలైన విద్యా విధానం సమాంతరంగా కొనసాగుతూ ఉన్నట్టు భావించవచ్చు. మద్రాసు రాష్ట్ర ప్రభుత్వం "స్థానిక నిధులు" సృష్టించి వాటిని విద్యాభివృద్ధికి ఉపయోగించటాన్ని 1871లోనే ప్రారంభించింది. ఈ ప్రణాళిక కింద ప్రారంభమైన పాఠశాలలు గోదావరి జిల్లాలో గొప్ప మార్పులకు కారణమయ్యాయని చరిత్రకారులు చెబుతారు. అంతేకాకుండా మద్రాసు ప్రభుత్వం 1877లో ప్రారంభించిన మూడు మొదటి గ్రేడు కళాశాలల్లో ఒకటి రాజమండ్రిలో స్థాపించబడింది. ఆ కళాశాల కూడా గోదావరి జిల్లా సాంస్కృతిక జీవితంలో గొప్ప పాత్రను నిర్వహించింది. కానీ ఈ సమాంతర విద్యప్రభావం బ్రాహ్మణాగ్రహారాలమీద ఉన్నట్టు లేదు. వారు కుల విద్యల్ని నేర్చుకుంటూ, కుల వృత్తుల్ని చేసుకుంటూ, పండిత సంచారాలు చేసుకుంటూ జీవిస్తూ వున్నట్టుగా శ్రీపాద కథనం చెబుతుంది.

శ్రీపాద వర్ణించిన ఆనాటి విద్యా విధానం గురుకుల వాసమే. విద్యార్థి తాను ఏ శాస్త్రం చదువుకోవాలో మొదట నిర్ణయించుకొని, తరువాత దాన్ని పాఠం చెప్పగల గురువును ఆశ్రయించాలి. గురువుగారు నివాసం ఉన్న గ్రామంలో ఏడు రోజులకూ ఏడు ఇళ్ళలో వారాలు ఏర్పాటు చేసుకోవాలి. ఆనాటి విద్యార్థులు ఈ పద్ధతిని అవమానంగా భావించే వారు కాదు. శ్రీపాద కూడా వారాల పద్ధతి మీద ఆధారపడ్డ గురుకులవాస విద్యా విధానాన్ని మెచ్చుకుంటారు. విభిన్నమైన మనస్తత్వాలుకల కుటుంబాలతో సర్దుకు పోవటం ఎలాగో ఈ విధానం నేర్పుతుందని శ్రీపాద అభిప్రాయం. విద్యా విధానాన్ని గురించిన భాగం ఈ గ్రంథంలో చాలా విలువైంది. అది అనేక సామాజికాంశాలను మనకు తేటతెల్లంగా చూపుతుంది. ఆ కాలంలో ప్రధాన విద్య వేదాలూ, శాస్త్రాలూ మాత్రమే. కాబట్టి అబ్రాహ్మణ గురువులు కానీ, అబ్రాహ్మణ శిష్యులుకానీ ఉండేవారు కారు. అలా విద్య ఒక కులానికి మాత్రమే పరిమితంగా ఉండేది. శాస్త్ర గురువులు సాధారణంగా సాహిత్యాన్ని పాఠం చెప్పేవారు కారు. చాలా మంది శాస్త్ర పండితులకు సాహిత్యమంటే చిన్నచూపు ఉండేది. కొద్ది మంది గురువులు సాహిత్యాన్ని పాఠం చెప్పినా అది ముగ్గురు, నలుగురు సంస్కృత కవులకు మాత్రమే పరిమితంగా ఉండేది. వారి గ్రంథ సంచయంలో తెలుగు గ్రంథాలు ఉండేవి కావు. వారికి కవిత్రయ భారతం, పోతన భాగవతం వంటి మహాకావ్యాల మీద కూడా సదభిప్రాయం ఉండేది కాదు. "వసుచరిత్ర", "విజయవిలాసం" వంటి కావ్యాల మీద అబ్రాహ్మణులకు మాత్రమే ఆసక్తి ఉండేది. ఆనాటి గురువులకు తెలిసింది తక్కువే. దాని ప్రయోజనం కూడా తక్కువే. వారికి ఇతర విజ్ఞాన శాఖలతో సంపర్కం లేకపోవటం చేత ఆ విషయం వారికి బోధపడేది కాదు. ఈ గ్రంథంలో శ్రీపాద అలాంటి పండితులను నిరసించడు. అమాయకమైన వారి పాండిత్య దృక్పథాన్ని ఆనాటి సామాజిక పరిస్థితుల ఆధారంగా అర్థం చేసుకొని, వారు తమ చుట్టూరా గీచుకున్న వలయాలలోంచి బయటికి రావలసిన అవసరాన్ని గురించి చెబుతాడు. శ్రీపాద హృదయంలో ద్వేషానికి చోటు లేదు.

ఆనాటి గురువులు చాలామంది తమకు తెలిసినదాన్ని ప్రేమతో, నిష్కల్మషంగా పాఠం చెప్పేవారు. కానీ ధూర్తులూ, మత్సరగ్రస్తులూ అయిన విద్వాంసులు లేక పోలేదు. శ్రీపాదకు సంగీతం నేర్పుతానని మోసం చేసిన వారణాసి సర్వదేవుడూ, ఛందస్సు నేర్పుతానని మోసం చేసిన కొత్తపల్లి సూర్యనారాయణా అలాంటివారు. అలాంటి వారిలో అగ్రేసరుడు వాజపేయ యాజుల పాపయ్యసోమయాజులు. నడివయస్సులో శ్రీపాద తండ్రిగారికి "అశ్వినం"

(చయనంలో ఉపయోగపడే ఒక ఋగ్వేద భాగం) నేర్చుకోవలసిన అవసరం కలిగింది. వారు దాన్ని బాగా తెలిసిన సమీప బంధువూ, స్నేహితుడూ అయిన పాపయ్య సోమయాజుల వద్దకు వెళ్ళి, నేర్పమని అడిగారు. అతడు "నాకు తప్ప మరి ఒకడికి అది రావటం యిష్టం లేదు బావా", అని నిర్దాక్షిణ్యంగా తిరస్కరించాడు. ఈ గ్రంథంలో ఈ సంఘటనకు చాలా ప్రాముఖ్యత ఉంది. మన దేశంలో అనేక విద్యలూ, శాస్త్రాలూ ఎందుచేత నశించి పోయాయో తెలుసుకోవటానికి ఈ సంఘటన కీలకంగా ఉపయోగపడతుందని నేను భావిస్తున్నాను.

శ్రీపాదకు కుల విద్యమీద ఎందుచేత ఏవగింపు కలిగిందో చెప్పటం తేలికైన పనికాదు. అందుకు అనేక కారణాలుండవచ్చు. కానీ వాటిలో ముఖ్యమైంది వారికి తెలుగు భాష మీద కలిగిన మమకారమని నా నమ్మకం. తెలుగులో "గజం ఎత్తు పుస్తకాలు రాయాలన్న కోరికా", దీనికి తోడు వీరేశలింగం గారి ప్రభావమూ శ్రీపాదలో అంత విప్లవాత్మకమైన మార్పును తీసుకువచ్చాయి. సమాజాన్ని గురించిన అభిప్రాయాలు మారకుండా కళలను గురించిన అభిప్రాయాలు మారవు. వీరేశలింగంగారి ప్రభావంతో శ్రీపాద "శుద్ధ ప్రచ్ఛన్న బ్రహ్మసామాజికుడే" అయిపోయాడు. ఆ మార్పు సామాజికమైంది కావటంచేత అది అనేక మార్పులకు కారణభూతమైంది. కుల విద్యలూ, కులసంస్కారమూ మాతృభాషను చదువుకోవటానికీ, అందులో రచన చేయటానికీ ప్రతిబంధకంగా మారాయని అర్థం చేసుకున్న శ్రీపాద వాటిని వదిలించుకోవటానికి చేసిన ప్రయత్నాలు సుదీర్ఘమైనవీ, సాహసోపేతమైనవీ కూడా. "కవిత్వం కట్టిపెట్టు" అని గర్జించిన తండ్రితో శ్రీపాద ఇలా అంటాడు:

"ఇంటో వుండటానికి వీలుకాదంటే ఎక్కడికయినా పోతాను. కులవిద్యలు విడిచి పెడుతున్నాను కనక కుటుంబాస్తి విడిచి పెట్టమంటే  నిశ్చితంగా విడిచి పెట్టేస్తాను. మీరు పొలమూరు తిరిగి రావద్దంటే జన్మలో చూడను... అంతేకానీ కవిత్వం కట్టిపెట్టమన్న మాట కట్టి పెట్టండి నా దగ్గర".

శ్రీపాద సాహిత్యాభిమానం, మాతృభాషాభిమానం అంత గొప్పవి.

తెలుగు పుస్తకాలను సంపాదించి, చదువుకోవటం, తెలుగులో కవిత్వం రాయటం, చొక్కాలు తొడుక్కోవటం, జుట్టు తీయించుకొని క్రాపింగు పెట్టుకోవటం, రంగుబట్టలు ధరించటం, హోటళ్ళలో తినటం మొదలైనవి ఇరవై ఒకటవ శతాబ్ద ప్రారంభంలో గొప్ప సాహసాలు కాకపోవచ్చు. కానీ ఇరవయ్యవ శతాబ్దం ప్రారంభంలో - మరీ ముఖ్యంగా గోదావరి ప్రాంత వైదిక బ్రాహ్మణ కుటుంబాల్లో ఎంత కష్టమైన, దాదాపు అసాధ్యమైన పనులో "అనుభవాలూ-జ్ఞాపకాలూను" చదివితే తప్ప అర్థం కాదు.

తెలుగులో కవి కావాలనుకున్న శ్రీపాద కొంతకాలం సొంతగా కృషి చేసి,  ఆ తరువాత పద్య విద్యారహస్యాలు గురు ముఖతఃనేర్చుకోవాలని నిర్ణయించుకున్నారు. ఆనాడు కవులు కావాలని ముచ్చట పడుతున్న యువకులకు రెండే రెండు గురుస్థానాలుండేవి. మొదటి వారు బందరు కేంద్రంగా ఉన్న తిరుపతి వేంకటకవులు. రెండవవారు పిఠాపురంలో ఉండిన వేంకట రామకృష్ణ కవులు. కానీ వీరిద్దరూ బద్ధ సాహిత్య శత్రువులు. వీరి మధ్య సాహిత్య యుద్ధాలు కొనసాగుతూ ఉండేవి. అవి కొన్నిసార్లు విజ్ఞాన దాయకంగానూ, మరికొన్నిసార్లు చాలా చవకబారుగానూ ఉండేవి. తిరుపతి వేంకటకవుల్ని కాకుండా శ్రీపాద వేంకట రామకృష్ణకవుల్ని గురువులుగా ఎంచుకోవటంలో కూడా అతని ఆధునిక సంస్కారం వ్యక్తమౌతుంది. చొక్కాలు లేకుండా, గంధాక్షతలూ, రుద్రాక్షమాలలూ ధరించే తిరుపతి వేంకట కవులకంటే కోట్లూ, బూట్లూ ధరించి, ముఖాన చుక్కబొట్టయినాలేని వేంకట రామకృష్ణ కవులే శ్రీపాదకు ఆమోద యోగ్యంగా కనిపించారు. తిరుపతి కవుల వద్దకువెళ్ళితే "మూడు పూటలా సంధ్యావందనం" చేయక తప్పదన్న భయం కలిగింది. వేంకట రామకృష్ణ కవులవద్దకు వెళ్ళితే "ఆ బాధ ఉండకపోవటమే కాదు, ఒక విధంగా సంస్కార దృష్టి సుపరిష్కృతమూ అవుతుంది", అనిపించి శ్రీపాద వారినే సాహిత్య గురువులుగా స్వీకరించాడు.

వేంకట రామకృష్ణకవుల శిష్యరికం వల్ల శ్రీపాదకు మేలూ, కీడూ కూడా జరిగాయి. వేంకట రామకృష్ణ కవులలో ఒకరైన రామకృష్ణశాస్త్రిగారు శ్రీపాదకు కొద్దిగా సాహిత్య శాస్త్రాన్నీ, కొన్ని తెలగు కావ్యాలనూ పాఠం చెప్పారు. పద్యవిద్య రహస్యాలను బోధించారు. అవధానంలోని కిటుకులు నేర్పారు. రామకృష్ణశాస్త్రిగారి నిత్యసహచర్యంతో శ్రీపాద మనస్సు శ్రౌతస్మార్తాలనుంచీ తెలుగు గ్రంథ రచనమీదికి మళ్ళింది. మళ్లీ అది వెనక్కు మళ్ళలేదు కాబట్టి అది శ్రీపాదకే కాదు, తెలుగు సాహిత్యానికి కూడా గొప్పమేలే! కానీ పద్యవిద్యకు సంబంధించిన అంతజ్ఞానాన్ని బోధించిన రామకృష్ణశాస్త్రి గారే శ్రీపాద దృష్టిని పద్యం మీదనుంచీ వచనం మీదికి మళ్ళించారు. రామకృష్ణశాస్త్రిగారు శ్రీపాద రచనా శక్తిలోని వచన రచన ప్రతిభను గుర్తించటం, గురువుగారి సలహాను శ్రీపాద శిరసావహించటం తెలుగు వచనం చేసుకున్న పుణ్యం.

వచన సాహిత్యానికి గమ్యం సమకాలీన జీవితం. వాస్తవిక జీవితాన్ని సహజమైన భాషలో చిత్రించి, వ్యాఖ్యానించటం ఆధునిక సాహిత్య లక్ష్యం. ఈ రెండు లక్ష్యాలకూ అందుకునే శక్తి వచనానికున్నట్టుగా పద్యానికిలేదు. వచనంలో రాయవలసిన కథావస్తువులను పద్యంలో రాయటం, పద్యాన్ని వచన భాషలో రాయటం నిష్ప్రయోజనమైన ప్రయత్నాలు. శ్రీపాద (బహుశా ఈ కాలంలోనే కాబోలు) ఇలాంటి ప్రయత్నాలు చేశారు. "మగధ పాలించావు జావాసుమత్రాల నెగురవేశావు నీ జయపతాక" వంటి వ్యవహారిక భాషా పద్యాలు రాశారు. కానీ ఆ ప్రయత్నాన్ని విరమించుకొని, తాను ఆవిష్కరించవలసిన కథావస్తువులు వచనానికి మాత్రమే బడుగుతాయని నిర్ణయించుకొని వచనంలో స్థిరపడేపోయారు. తెలుగు వచనం యొక్క నైసర్గిక సౌందర్యాన్ని అజరామరం చేశారు.

కానీ తిరుపతి వేంకటకవులకూ, వేంకట రామకృష్ణ కవులకూ మధ్య కొనసాగుతున్న కలహంలోకి శ్రీపాద తల దూర్చారు. నన్నయ్యను చదివి రక్తంలోకి ఎక్కించుకున్న శ్రీపాదను తిరుపతి వేంకటకవుల పద్యం "వొదులు వొదులుగా" కనిపించింది. వ్యక్తిగా తిరుపతి శాస్త్రిగారంటే కొంత గౌరవం కలిగిందిగానీ వేంకట శాస్త్రిగారంటే అదీకలగలేదు. అందుచేత శ్రీపాద తిరుపతి వేంకట కవులు రాసిన "శ్రవణానందము", "పాణిగృహీత" అన్న పద్య కావ్యాల మీద "శృంఖల" అన్న విమర్శ గ్రంథాన్ని రాసిప్రచురించారు. ఆ గ్రంథాన్ని తమ సాహిత్య శత్రువులు వేంకట రామకృష్ణ కవులే రాసి తమ శిష్యుని పేర ప్రచురించారని భావించిన వేంకట శాస్త్రి గారు "శృంఖలాతృణీకరణం" అన్న ప్రతి విమర్శను ప్రచురించారు. అంతటితో ఆనాటి సాహిత్యరంగం ఉల్లోలకలల్లోలం అయిపోయింది. మళ్ళీ శ్రీపాద ప్రతివిమర్శకు ప్రతి విమర్శగా "గళహస్తిక" అన్న గ్రంథాన్ని రాసి గురువుగారికి చూపించారు. అంత వరకూ మౌనం వహించిన రామకృష్ణశాస్త్రిగారు దాన్ని చించివేసే, "మా కలహంలోకి మీరు తల దూర్చకండి. మీరచన మీరు చేసుకోండి", అని శ్రీపాదను గట్టిగా మందలించారు. అంతటితో ఆ పుస్తకాలపోరాటం ఆగిపోయింది. పుస్తకాల పోరాటం ఆగిపోయనా వ్యక్తుల మధ్య ద్వేషం రాజుకుంటూనే వచ్చింది. అది వేంకటశాస్త్రిగారికీ, శ్రీపాదకు అవమానకరంగా రాజమండ్రి నడి వీధిలో బయటపడింది. రాజమండ్రిలో గోదావరిరైల్వే స్టేషన్ వద్ద అకస్మాత్తుగా ఎదురు పడ్డ ఇద్దరూ నీచంగా ఒకర్నొకరు తిట్టుకోవటం, చెప్పులు తీసి కొట్టుకోబోవటం, ఇతరులు జోక్యం చేసుకొని నివారించటం ఇద్దరిస్థాయికీ తగిన పనికాదు. శ్రీపాద మాటల్లోనే చెప్పాలంటే "ఇద్దరూ ఆ క్షణాన బజారు మనుషులే" అయిపోయారు. శ్రీపాద గొప్పదనం ఈ సంఘటనను దాచుకోకపోవటంలోనూ, తన ప్రవర్తనలోని సంస్కార రాహిత్యాన్ని అంగీకరించటంలోనూ ఉంది.

కుటుంబ సంప్రదాయానికి వ్యతిరేకంగా శ్రీపాద తెలుగు కవిత్వంలోకి రావటంతో ఆగకుండా సంగీతంలోకీ, నాటకాలలోకీ కూడా వెళ్ళటానికి ప్రయత్నించాడు. ఫిడేలు నేర్చుకోవటానికీ, రంగుపూసుకొని నాటకాలలో నటించటానికీ శ్రీపాద చేసిన ప్రయత్నాలు చాలా ఆసక్తికరంగా ఉంటాయి. శ్రీపాద ప్రయత్నాలు కుటుంబానికి కలిగించిన క్లేశాన్ని గురించీ, అతని ప్రయత్నాలను కుటుంబం ఆమోదించకపోవటం చేత శ్రీపాదకు కలిగిన క్లేశాన్ని గురించీ ఈనాటి

పాఠకులు ఈ గ్రంథాన్ని చదివి తెలుసుకోవాల్సిన అవసరం ఉంది.కవిత్వమూ, సంగీతమూ, నాట్యము "సభ్యవిద్యలు" కావట. "మహావిద్యలు" అసలేకావట. నట విట గాయకులు పంక్తి బాహ్యులు. వేదశాస్త్రాలు చదువుకున్న వారందరిదీ ఇదే అభిప్రాయం. ఈ అభిప్రాయాన్ని శ్రీపాద విపులంగా చర్చించారు. "అన్ని కళలనూ ఇంత హీనంగాచూసే వర్గం ఈ వేద శాస్త్రజ్ఞుల వర్గం తప్ప మరొకటిలేదు మనదేశంలో," అని తేల్చి చెప్పారు. వేద విద్యలు మాత్రమే విద్యలు, వేదాలకు అనుబంధంగా ఉన్నశాస్త్రాలు మాత్రమే శాస్త్రాలు, సంస్కృతం ఒక్కటే భాష తదితరమైనవి విద్యలు కావు, శాస్త్రాలు కావు, భాషలు కావు అన్న సంకుచిత సామ్రాజ్య వాద దృక్పథం కారణంగా భారతదేశంలో విజ్ఞాన ప్రగతి ఎన్ని శతాబ్దాలకాలం ఆగిపోయిందో శ్రీపాద గుర్తించగలిగారు. ఈ నాటికీ వేదం నేర్చుకోవటం (అంటే వేదాన్ని కంఠతా పట్టటం, వేదాన్ని గురించి ఆలోచించటం కాదు) ఒక్కటే మహావిద్య అని భావించేవారు లేకపోలేదు. అలాగే అనేక వందల సంవత్సరాలక్రితమే ఎదగటం ఆగిపోయిన తర్కం, మీమాంస లాంటివే వీరి దృష్టిలో శాస్త్రాలు, నిత్యనూతనంగా, నిరంతరంగా ఎదుగుతున్న ఆర్థిక శాస్త్రం, భౌతిక శాస్త్రం, సమాజ పరిణామ శాస్త్రం మనోవైజ్ఞానిక శాస్త్రం, అనేక ఇంజనీరింగ్ శాస్త్రాలూ వీరి దృష్టిలో శాస్త్రాలు కావు. వాటిని చదువుకున్నవారు "శాస్త్ర పండితులు"కారు. పాండిత్యాన్ని గురించి మనదేశంలో శతాబ్దాల పాటు కొనసాగిన అతి సంకుచిత దృక్పథం విస్తృతమైన విజ్ఞాన పిపాసకు మన దేశంలో అవకాశమే లేకుండా చేసింది. ఈ సంకుచితత్వం కింద నలిగిపోయిన శ్రీపాద లాంటి జిజ్ఞాసువులు మనదేశంలో ఎందరో!

విద్యలను గురించి మాత్రమే కాదు అవధానాలను గురించి కూడా శ్రీపాదకు ఆనాటికే అభ్యుదయ దృక్పథం ఉంది. అవధానుల యుగంలో పుట్టి, పెరిగి, అవధానుల వద్ద చదువుకొని, అవధానులతో వాదప్రతివాదాలు జరిపి, స్వయంగా అనేక అవధానాలు చేసిన శ్రీపాదకు అవధానమంటే ఉన్న అభిప్రాయం చాలా ఆసక్తికరమైంది. "నన్నడిగితే కవి అయినవాడికి అవధాన ప్రక్రియపతన హేతువు". అంటారు వారు అవధానాన్ని గురించి. అష్టావధానాలూ, శతావధానాలూ, సహస్రావధానాలూ, ద్వి, త్రిశతావధానాలూ... అర్థంలేని వేలం వెర్రిగా, వ్యాపారంగా, సాహిత్యాభిరుచికి పతన హేతువుగా, నిజమైన సాహిత్య చింతనకు ప్రతిబంధకంగా, లక్షలాది ప్రజాధనానికి దుర్వినియోగ సాధనంగా తయారైన ఈనాడు శ్రీపాద అభిప్రాయానికి విలువవేయి రెట్లు పెరిగింది. దాన్ని అవధానులు ఎలాగూ గుర్తించరు కాబట్టి (వాళ్ళు కవులు కాదు కాబట్టి) సాహిత్యాభిమానులైనా శ్రీపాద అభిప్రాయంలోని సత్యాన్ని గుర్తించటం మంచిది. కవి హృదయానికీ, సాహిత్యానికీ, సమాజానికీ మధ్య ఒక సజీవ సంబంధం ఉండాలి. సాహిత్యం రచయిత జీవుని వేదనలో నుంచీ, సామాజిక చైతన్యంలో నుంచీ ఉద్భవించాలి. అడిగినవాడికి అడిగిందాన్ని ఇచ్చే అవధాన ప్రక్రియలో అలాంటి మహోన్నత సృజనశీలతకూ, చైతన్యానికీ వీలులేదు. కానీ దురదృష్టవశాత్తు అవధానమే తెలుగు జాతి సాహిత్య చైతన్యానికీ, రసికతకూ చిహ్నంగా మారిపోయింది. నిజమైన సాహిత్య చైతన్యం అభివృద్ధి చెందటానికి అవధానం ఆంధ్రదేశంలో ప్రతిబంధకంగా తయారౌతోంది. చాలా మంది సాహిత్య ప్రేమ అవధానం వద్దనే ప్రారంభమై అవధానం దగ్గరే అంతమౌతూ ఉంది. శ్రీపాద ఎప్పుడో మనకళ్ళు తెరిపించాలని ప్రయత్నించినా మనం ఇంకా కళ్ళు మూసుకునే ఉండటం బాధాకరం.

"అనుభవాలూ-జ్ఞాపకాలూను" చదివిన పాఠకులను తీవ్రంగా ఆకర్షించే మొదటి లక్షణం శ్రీపాద వ్యక్తిత్వం. గౌరవించదగిన అరుదైన వ్యక్తిత్వం శ్రీపాదది. అందులో భయంలేదు. కాపట్యంలేదు. మన వెన్నులో వణుకు పుట్టించేటంత ధైర్యశాలి వారు. ఆర్ధతతో తప్ప ఇతరులను అభిశంసించలేని సౌజన్యం వారిది. వారి వ్యక్తిత్వంలో వైరుధ్యాలు లేవా అంటే ఉన్నాయి. ఉదాహరణకు తాను తిరస్కరించిన వైదిక విద్యలపట్ల వారికి అపారమైన మమకారం ఉంది, గౌరవమూ ఉంది. వేదాలు అపౌరుషేయాలనీ, బ్రహ్మముఖోద్గతాలనీ వారి నమ్మకం. సంస్కృతభాష మీద గూడా వారికి అంతే గురీ, గౌరవమూ ఉన్నాయి. వారి అభిప్రాయం ప్రకారం సంస్కృతం భారతీయతకు చిహ్నం. "కనక, ఆ వైదిక ధర్మం విడిచిపెట్టేసుకుంటే, ఆ సంస్కృత భాష కూడా విడిచి పెట్టేసుకుంటే - మన భారతీయతనూ, జాతీయతనూ, మన మాన

ప్రాణాలనూ నిలపగలవాడు సృష్టిలోలేడు", అంటారు శ్రీపాద. మరితాను ఎందుచేత వాటిమీద తిరుగుబాటు చేసినట్టు? శ్రీపాద తిరుగుబాటు చేసింది వేదాల మీదా, సంస్కృత భాష మీదా కాదనీ, వేదాలనూ, సంస్కృత భాషనూ తమ గుప్పిట్లో ఉంచుకొని, సమాజం ఎదగకుండా అడ్డుపడుతున్న తిర్యక్ దృష్టుల మీదననే అర్థం చేసుకోవలసి ఉంటుంది. తాను ప్రాణసమానంగా ప్రేమించే తెలుగుతనం రూపొందకుండా సంస్కృత సంస్కృతి ఎన్ని శతాబ్దాలు అడ్డునిలిచిందో శ్రీపాద గుర్తించలేకపోయారు. సంస్కృత భాషా ప్రభావాన్ని భావ దాస్యం స్థాయికి ఎదగనీకుండా నిరోధించుకొని, స్వభాషను అభివృద్ధి చేసుకొని తమిళులు "తొల్ కాప్పియం", "తిరుక్కురల్", "శిలప్పదికారం" వంటి మహోన్నత గ్రంథాలను సృష్టించుకున్న తరువాత పది శతాబ్దాలకు గానీ తెలుగు సాహిత్యం అభివృద్ధి చెందలేదు. ఇరవయ్యవ శతాబ్దం ప్రారంభంలో కూడా తెలుగు గ్రంథాలను చదవకూడదని నిషేధించే వేదశాస్త్ర పండితులున్న దేశంలో పది శతాబ్దాలకు పూర్వం తెలుగులో రచన ప్రారంభించిన నన్నయ్యను ఈ వర్గం ఎంత క్షోభపెట్టి ఉంటుందో ఊహించుకోవటం కూడా సాధ్యంకాదు. శ్రీపాదలో ఉన్న మరొక వైరుధ్యం ఇంగ్లీషు భాషకు సంబంధించింది. వారు "నిజానికి ప్రపంచం అంతటా బహుళ ప్రచారం కల ఇంగ్లీషు రాకపోవటం నాకే కాదు ఎవరికైనా దౌర్భాగ్యమే", అనగలిగారు.

శ్రీపాద అభిప్రాయాలలో అతివాద లక్షణాలు కూడా లేకపోలేదు. వారికి గాంధీగారన్నా, హిందీ అన్నా, ఖద్దరన్నా బొత్తిగా పడదు. పడకపోవటం మాత్రమే కాదు. పూర్తి తిరస్కారం కూడా. భారతీయ భాషల సమానత్వం మీద వారికి సానుభూతి ఉన్నా హిందీ పట్ల ధిక్కారమే. హిందీ ఇతర భాషా సంస్కృతుల ఎదుగుదలకు ప్రతిబంధకంగా తయారౌతుందన్నది శ్రీపాద అభిప్రాయం. వారు అక్కడ ఆగలేదు. హిందీ మీదున్న వ్యతిరేకత హిందూస్తానీ సంగీతం మీద బద్ధ వ్యతిరేకతగా, ద్వేషంగా శ్రీపాదలో రూపుదిద్దుకుంది. వీధినాటకాలూ, తోలు బొమ్మలాటలూ మాత్రమే ఎరిగిన తెలుగు వారికి ధార్వారీ సమాజాలు స్టేజినాటకాలను పరిచయం చేశాయి. ఈ ధార్వార్ సమాజాలు హిందుస్తానీ బాణీలను ప్రవేశపెట్టి సంగీతాన్ని భ్రష్టు పట్టించాయని శ్రీపాద కోపఘూర్ణితుడైపోతారు. కర్ణాటక సంగీతమే సంగీతం, హిందూస్తానీ సంగీతం సంగీతమే కాదనటం తప్పకుండా అతివాదమే. రెండు సంగీత సంప్రదాయాలకూ శాస్త్ర పునాది ఒకటే అయినప్పుడు అలాంటి ద్వేషానికి అర్థం లేదు. పేర్లు వేరైనా అనేక రాగాలు రెండు సంప్రదాయాలలోనూ సమానంగా ఉన్నాయి. లేదంటే వాటిని పాడే విధానంలో చిన్న చిన్న తేడాలున్నాయి. కర్ణాటక సంగీత విద్వాంసులు లయకు ప్రాధాన్యతనిస్తే, హిందూస్తానీ విద్వాంసులు శృతికి ప్రాధాన్యతనిస్తారు. అనేక హిందూస్తానీ రాగాలు కర్ణాటక సంగీతంలోకి ప్రవేశించి, శాశ్వతంగా నిలిచిపోయాయి. కర్ణాటక రాగాలను కూడా హిందూస్తానీ ఛాయతో పాడటం బాగా ప్రజాదరణ పొందుతోంది. దక్షిణాది నుంచీ బాలగంధర్వ, భీంసేన్ జోషీ, మల్లికార్జున మన్సూర్ వంటి దిగ్గంతులు మాత్రమేకాకుండా చాలా మంది మలితరం విద్వాంసులు హిందూస్తానీ సంగీతంలో అఖిల భారత స్థాయికి ఎదిగారు. హిందుస్తానీ "గజల్" దక్షిణాదిలో గొప్ప ప్రచారాన్ని పొందుతూ ఉంది. కర్ణాటక, హిందూస్తానీ విద్వాంసుల మధ్య "జుగల్ బందీ"లు రెండు ప్రాంతాలనూ సంగీత ప్రియులనూ విపరీతంగా ఆకర్షిస్తున్నాయి. ఇలా సాహిత్యంలో లాగే ఇతర కళల్లో కూడా పరపరాగ సంపర్కం జరుగుతూ ఉంటుంది. సాహిత్య రంగంలో ఈ పరిణామాన్ని స్వాగతించిన శ్రీపాద అదే పరిణామాన్ని సంగీత రంగంలో ఆమోదించలేకపోవటం ఆశ్చర్యమే. హిందూస్తానీ సంగీతం దక్షిణాదిలోనికి ఇంతగా చొచ్చుకు రావటాన్ని శ్రీపాద చూచి ఉంటే భరించలేకపోయేవాడేమో! శ్రీపాద గాంధీగారినీ, హిందీనీ, ఖద్దురునూ వ్యతిరేకించాడనీ, "ప్రబుద్ధాంధ్ర" పత్రికలో దాన్నొక ఉద్యమంగా నడిపి, ఏటికి ఎదురీదాడనీ చాలా మందికి తెలుసు. కానీ అది ఈ గ్రంథంలో దానికి పెద్దపీట లేదు. కానీ ఈ విషయాన్ని తెలుసుకోవటం శ్రీపాద వ్యక్తిత్వాన్ని అర్థం చేసుకోవటం కోసం చాలా అవసరం.

శ్రీపాదను గురించి ఆలోచించేటప్పుడు వారి శైలిని గురించి కూడా ఆలోచించక తప్పదు. అది ఒక ప్రత్యేక విశ్లేషణకూ, పరిశోధనకూ అర్హమైన అంశం కూడా. ఆధునిక భాషా శాస్త్రం - ముఖ్యంగా సామాజిక భాషా శాస్త్రం (Socio-Linguistics) చదువుకున్నవారు శ్రీపాదలో భావానికీ, భావ వ్యక్తీకరణ విధానానికీ మధ్య ఉన్న సంబంధాన్ని గురించీ, వారి

వాక్యనిర్మాణ పద్ధతులను గురించీ పరిశోధన చేయవలసిన అవసరం ఉంది. గోదావరి ప్రాంతంలోని బ్రాహ్మణాగ్రహారాల్లో ఇరవయ్యవ శతాబ్దం పూర్వార్ధంలో వినిపిస్తూ ఉండిన భాషను శ్రీపాద ఎంతో ప్రామాణికంగా అక్షరబద్ధం చేశారన్నది పండితాభిప్రాయం. శ్రీపాదలో పండిత ఛాయలు లేకపోలేదు. కానీ వారి భావ వ్యక్తీకరణ విధానం ప్రధానంగా వినికిడి మీద ఆధారపడింది. తాము ఆ భాషనూ, ఆ అభివ్యక్తినీ ఎలా నేర్చుకున్నారో శ్రీపాద విశదంగా చెప్పారు. తాను అంత వరకూ చదువుకున్నది పద్యవాఙ్మయం. ప్రధాన అధ్యయనం సంస్కృతం. అది కూడా లౌకిక సంస్కృతం కాదు-వేదాల, ఉపనిషత్తుల, శ్రౌతస్మార్తాల సంస్కృతం. రచన చేయటానికి ప్రారంభించింది తెలుగు వచనంలో. అందుచేత శ్రీపాదకు భాష విషయంలో లంగరందలేదు. కాబట్టి వారు "జనుల సంభాషణలు" శ్రద్ధగా వినవలసివచ్చింది. పురుషుల భాషలో కంటే స్త్రీల భాషలోనే శ్రీపాదకు "మాధుర్యమూ, హృదయాలను పట్టివేసే జాతీయతా, మాటల పొందికా, హావభావప్రదర్శనా చాతుర్యమూ" కనిపించాయి. అందుచేతనే వారు "నలుగురు స్త్రీలు ఎక్కడ మాట్లాడుకుంటూ ఉన్నా వింటూ ఉండిపోయే" వారు. అలా వింటూ వింటూ "జాతీయమైన తెలుగు భాష కావాలంటే స్త్రీల దగ్గరే నేర్చుకోవాలి" అన్న సత్యాన్ని తెలుసుకున్నారు. "ఇవాళ నేను రాస్తున్న భాష వారనుగ్రహించిన దాన్లో సహస్రాంశమైనా కాదు," అని అనగలిగినంత సౌజన్యాన్ని అలవాటు చేసుకున్నారు.

వెన్న పడుతుండగా కుండ పగిలిపోయినట్టుగా శ్రీపాద అనుభూతి కథనం వారి అకాల మరణం కారణంగా ఆగిపోయింది. కథనం ఆగిపోయే కాలానికి వారింకా కథా రచన ప్రారంభించలేదు. శ్రౌతస్మార్తాలనుంచీ సాహిత్యంలోకీ, పద్యంనుంచీ అవధానం నుంచీ వచనంలోకీ వచ్చారే కానీ గ్రాంథికం నుంచీ వ్యావహారికంలోకి రాలేదు. మృతపదజాలాన్నీ, అసహజవాక్య నిర్మాణ పద్ధతులనూ విసర్జించి సహజమైన, తేటైన తెలుగు భావవ్యక్తీకరణ కోసం తాపత్రయపడుతున్నారు. "వారకాంత", "స్మశాన వాటిక", "మిథునానురాగము" మాత్రమే అప్పటికి రాశారు. ఈ పుస్తకాల భాషను పరిశీలిస్తే శ్రీపాద అన్వేషణ స్పష్టంగా కనిపిస్తుంది. శ్రీపాద జీవితాన్ని కథారచన ప్రారంభాన్ని విభజన బిందువుగా తీసుకొని రెండు భాగాలుగా విభజిస్తే ఈ గ్రంథం మొదటి భాగం యొక్క చిత్రణ మాత్రమే . ఈ కథనం మనకు అందుబాటులో ఉన్న పద్ధతిలోనే కొనసాగి ఉంటే మరెన్నో సంపుటాలకు విస్తరించి ఉండేది. మొత్తం మీద ఈ గ్రంథం పూర్తికాక పోవటం (తిరుమల రామచంద్రగారి జీవిత కథనంలాగే) తెలుగుజాతి దురదృష్టం. 1920 దశకంలోని పరిణామాల చిత్రణ వద్ద ఈ గ్రంథంలోని కథనం ఆగిపోయింది. అది కొనసాగి ఉంటే, శ్రీపాద తన కథానేపథ్యాలను చర్చించి ఉంటే, కథా రచయితగా తన అనుభవాలను వర్ణించి ఉంటే ఈ గ్రంథం నిజంగానే అమూల్యమైపోయేది.

ఈ గ్రంథాన్ని ప్రచురించిన విశాలాంధ్ర ప్రచురణాలయం వారికి సాహిత్యాభిమానులు ఋణపడి ఉంటారు. చాలా కాలంగా అలభ్యంగా ఉన్న ఈ గ్రంథం ఇప్పుడు లభ్యం కావటం గొప్ప సాహిత్య సంఘటనే. అందుకు సందేహం లేదు.

back to book of the week home page

❖ ఈ విశేష సమీక్షా వ్యాసం శ్రీ అప్పాజోస్యుల సత్యనారాయణ గారి వదాన్య సౌజన్యంతో అందించబడింది.